# తిరుగు ప్రయాణం

తూర్పున ఎత్తయిన కొండ. పడమటి వైపున చిట్టడివి. పైన ఎర్రగా సంధ్య. కిటికీ ప్రక్కన కూర్చుని పిచ్చి పిచ్చిగా వెలుపలికి చూస్తు న్నాడు విశ్వం. రైలు పరుగిడుతోంది.

రైలు పెట్టెలోనికి ప్రయాణీకుల కెవ్వరికీ సంధ్యా సౌందర్యంపైన ధ్యాస మళ్ళినట్టు లేదు. నలుగు రైదుగురు పెద్దమనుషులు రాజకీయ చర్చల్లో మునిగి బిగ్గరగా నోరు చించుకోవడమే వాగ్వాదంలో విజయంగా తలపోస్తున్నారు. చంటిబిడ్డను సముదాయించలేని కోడల్ని ఓ అత్తగారు మందలిస్తూ వుంది. ఓ ముసలాయన అరమోడ్పు కళ్ళతో భజగోవింద శ్లోకాలను మననం చేసుకుంటున్నాడు. కాలేజి స్టూడెంటు ఒకతను డిటెక్టివు నవలను సగంలో ఆపి ముఖచిత్రంకేసి చూస్తున్నాడు.

నిశ్చలమైన కళ్ళకు వెనుక ఏదో ఆందోళన, మునిపళ్ళ క్రింద నలిగిపోతున్న పెదవుల వంపులో ఏదో పట్టుదల. వుండి వుండి వెలువడు తున్న నిట్టూర్పుల అట్టడుగున ఏదో వ్యథ. ఈ మూడు దారాల ముప్పే టలో నలిగిపోతున్న విశ్వానికి సంధ్యా సౌందర్యంపైన చూపానడంలేదు. ఆమాటకొస్తే గడచిన పది పదిహేను రోజులనుంచీ అతడి పరిస్థితి ఇలాగే వుంది. తిండి సహించదు. నిద్ర పట్టదు. ప్రతినిమిషమూ ఒక యుగంగా, ప్రతి మనిషీ ఒక శత్రువుగా, ప్రతి మాటా ఒక కర్ణశూలంగా బాధింపసాగిన ఆ వాతావరణంలో ఇమడలేక పోయాడు విశ్వం!

ఐనా పెద్దవాళ్ళన్న పేరుతో వ్యవహరింపబడుతున్న ఈ ముసలి వాళ్ళకు యింతటి తెంపరితనం తగదు వీళ్లు కన్నారు. నిజమే! పెంచి పెద్దజేశారు. యథార్థమే! చదివిస్తున్నారు. సత్యమే! ఐతేమాత్రం, ఇదంతా వీళ్ళు తమ బాధ్యతను నిర్వర్తించడం మాత్రమేగదా! పోగా యిందులో స్వార్థం తప్ప త్యాగమని చెప్పుకోదగిందేముంది? తోటమాలి దోహద క్రియలు చేసి చెట్టును పెంచడమెందుకు? దాని నీడలో తల దాచుకోడానికి, దాని కాయలు దులుపుకోడానికి!

ఆలోచించినకొద్దీ ఈ పెద్దవాళ్ళు చేయదలచుకున్న పని నదికి అడ్డంగా ఆనకట్ట కట్టడంలా కనిపిస్తుంది. ఆనకట్ట వేయడమెందుకు? నీళ్లను ఎలా కావలిస్తే అలా మళ్లించుకోడానికి. నదికి సంబంధించినంత వరకూ ఈ పద్ధతి మంచిదే కావచ్చు. కానీ మానవుడికి సంబంధించినంత వరకు యిది నిస్సందేహంగా ఒక కుతంత్రం! బొందిలో ప్రాపిరున్నంత వరకూ తానీ కుతంత్రానికి తల ఒగ్గేది లేదు!

విశ్వం వెయ్యిసార్లు ఆలోచించాడు, ఆలోచించిన ప్రతిసారీ ఈ నిర్ణయానికే వచ్చాడు.

కోపంతో పళ్ళు కొరుక్కున్నాడు విశ్వం. తన వ్యక్తిత్వంపట్ల యింతటి నిర్లక్ష్యమా వీళ్ళకు! తననొక కీలుబొమ్మగా చేసి ఆడించవచ్చు ననా వీళ్ళ వుద్దేశం? సెలవులు ప్రారంభం కాగానే బయల్దేరిరమ్మని జాబు వ్రాసి, యింటికి వెళ్ళగానే లగ్న పత్రిక చూపిస్తారా? పైగా త్రవ్వి తన తలకేదో ఎత్తినట్టు మురిసిపోవడాలు కూడానా?

ఆ పిల్లట, పచ్చి పసుపు కొమ్మును చిదిమి చేసిన బంగారపు బొమ్మట! అమ్మాయిని చూస్తే పేరు తెలుసుకోవలసిన అవసరం లేదట! పేరు తెలుసుకుంటే మనిషిని చూడడం అనవసరమట! అబ్బో. ఏంవర్ణన! సంగీతంలో సాధన చేయకపోయినా ఆమె కంఠంలో కిన్నెర మ్రోగుతుం

దట! పెద్దగా చదువుకోకపోయినా, తెలుగులో ఏ పుస్తకం చేతికిచ్చినా గడగడా చదివేస్తుందట! 'ఆహా ఏం ప్రజ్ఞా కౌశలం' అనుకున్నాడు విశ్వం.

అతడు చరాలున ఓ సిగరెట్టు ముట్టించి కసిగా యింత పొగను బయటికి వదిలేశాడు.

సిగరెట్టు పొగ విశ్వం కళ్ళ ఎదుట రకరకాలుగా గిరికీలు కొట్ట సాగింది. సన్నగా పొడుగ్గా పిట్టగోడ కానుకుని నిల్చున్న లేతవయసు అమ్మాయిలా కనిపిస్తూ ఆ సిగరెట్టు పొగ కొంతసేపు ఒయ్యారాలు ఒలక పోసింది. విశ్వానికి రేఖాచిత్రంలో సరోజిని పోలికలు స్పష్టంగానే కనిపించాయి.

సరోజిని! ఆ పేరు జ్ఞప్తికి వస్తేచాలు, విశ్వం పరవశుడై పోతాడు.

సరోజిని గొప్ప కుటుంబంలో పుట్టి పెరిగిన అమ్మాయి ఈ 'గొప్ప' అన్న విశేషణం ఏ విధంగా చూచినా సార్థకమే. ఆమె తండ్రి పోలీసు డిపార్టుమెంటులో చేసిన ఉద్యోగం గొప్పది ఆ ఉద్యోగంద్వారా సంపాదించిన ఆస్తి గొప్పది, కొడుకులకూ, కూతుళ్ళకూ యిచ్చిన స్వేచ్ఛ మరీ గొప్పది. ఆయన వరుసగా అందరినీ చదివించారు, ఎవరెవరికి ఏసంబంధం యిష్టమైతే ఆ సంబంధమే ఖాయం చేసి పెళ్ళిళ్ళు చేశాడు. ఆయనను కుటుంబ యజమాని అనడంకన్నా బ్యాంకు మేనేజరు అనడం సమంజసం! భార్యకు, బిడ్డలకు వారివారికి కావలసిన డబ్బును వారికి ముట్టజెబుతూ ఆయన ఓ మఠానికి ధర్మకర్తలా వ్యవహరించాడు.

సరోజిని పట్టణంలో అక్కగారింటిలో వుంది. చదువుకుంటోంది. ఆ అక్కగారికి బిడ్డలు లేరు, ఆ వెలితి కనిపించకుండా వుండడంకోసం ఆ భార్యాభర్తలకు సరోజిని కాస్త ఉపకరించింది. కమీషను ఏజంటుగా మండీ నడుపుతున్న సరోజిని బావగారి పేరు రాధాపతి. ఏదో కాలేజి

ఫంక్షను కోసం నగరంలో విరాళాలు వసూలుచేస్తూ విశ్వం రాధాపతిని కలిశాడు. ఆభేటీకి అతడు మండీని కాకుండా రాధాపతి నివాసగృహాన్నే ఎన్నుకున్నాడు. తనతోబాటు చదువుతున్నాడనీ, క్లాసులో మొదటిమార్కులన్నీ యితడివేననీ సరోజిని విశ్వాన్ని బావగారికి పరిచయం చేసిపెట్టింది. ప్రసంగం మరికొంత దూరం నడిచేసరికి విశ్వం మరొకడు మరొకడు కాదనీ, రాధాపతిగారికి నాలుగైదు వ్రేళ్ళు విడిచిన దూరపు బంధువే ననీ తేలింది.

"ఏం దూరం లేవోయ్! అంత మన మనుకోడంలోనే వుంది. ఢిల్లీ మనకు చాలా దూరమను కుంటాము. నిజమే! కాలి నడక పైన వెళ్తే దూరమే! రైల్లో నైతే అంత దూర మనిపించదు. విమానంలో కూచుంటే మరింత దగ్గరై పోతుంది. అడ్డుగోడల్ని కూలదోసి మనసును విశాలం చేసుకుంటూ పోవాలి. అలా పోగలిగితే అమెరికావాడు రష్యా పౌరుడు, అరబ్బీ సాయిబూ, నువ్వూ, నేనూ అందరమూ ఒకటీ!"

ఈ సంస్కారం విశ్వంపైన అదొక పన్నీటి జల్లులా సోకింది, మండీ వ్యాపారి రాధాపతికి, విశ్వమానవ సోదరత్వమనేది పసందుగా మాట్లాడుకోడానికి పనికివచ్చే ఒక అంశంమాత్రమేనని విశ్వానికి తెలియదు. 'మీ ఎదురింటి గృహస్థు డెవరు? మీ ప్రక్కింటి పెద్దమనిషి పేరేమిటి? అని గనుక విశ్వం ప్రశ్నించివుంటే మనిషికీ మనిషికీ ఎంత దూరమో తెలిసివచ్చి వుండేది!

మొదట విరాళం కోసమని వెళ్ళిన విశ్వం ఆ తరువాత విశ్రాంతి కోసమనీ, వినోదం కోసమనీ రాధాపతిగారింటికి వెళ్తూ వచ్చాడు విశ్రాంతి లభించిందని చెప్పలేము గానీ, విశ్వానికి వినోదం మాత్రం పుష్కలంగా లభిస్తున్నట్టు తోచింది. నిజానికి ఆమాట గూడా నూటికి నూరుపాళ్లు నిజం గాదు. వ్యాపార విషయాల్లో మునిగి తేలి రాత్రి ఏ తొమ్మిది గంటలకో

యిల్లు చేరుకున్న తర్వాత రాధాపతికి కాసేపు ప్రపంచపు పోకడలను గురించి మాట్లాడితే గానీ నిద్ర పట్టేది గాదు. స్వయంగా తనకు అభిరుచి లేకపోయినా విశ్వం అతడి కోసమని చిత్రమైన వార్త లన్నింటినీ సేకరించేవాడు. రాధాపతి భార్యకు సినిమాలంటే చెప్పరానంత యిష్టం, సినిమా లోకానికి సంబంధించి విశ్వం రోజుకొక కొత్త కబురు కనిపెట్టి ఆమెను ఆశ్చర్యంలో ముంచి లేవనెత్తేవాడు. ఇక కాలేజి విషయాలు మాట్లాడుతూ లెక్చరర్లను విమర్శించడానికి పూనుకుంటే సరోజిని ఒళ్ళంతా కదిలిపోయే టట్లు నవ్వేసేది. ఏవిధంగా చూచినా విశ్వానికి ఆ కుటుంబంద్వారా లభించిన వినోదం కన్నా, అతడి మూలంగా ఆ కుటుంబానికి లభించిన వినోదం ఎక్కువ. ఓ సజీవ వినోద సాధనం లాంటి విశ్వానికి అక్కడ స్వాగతాలు, అడపా దడపా కాస్తా కూస్తా విందులూ. ఉపాహారాలు లభిస్తూ వచ్చాయి. ఆ అభిమానాన్ని, ఆదరాన్ని ఆసరాగా తీసుకుని పగటి కలలు కనమని విశ్వాని కెవరూ చెప్పలేదు. ఐనా నోరు విడిచి చెప్పాలేమిటి? సరోజిని హావభావ విన్యాసాలలోనుంచీ అనురాగం తొంగి చూస్తున్నట్లే ఊహించాడు విశ్వం. ముసుగులో గుద్దులాట కట్టిపెట్టి తన మనసులోని భావాన్ని బాహాటంగా బయట పెట్టాలని అనుకోకపోలేదు. ఐనా యిప్పుడేం మించిపోయింది? ఇంకా ఒక సంవత్సరం చదువుకోవాలి. ఆ తరువాత వుద్యోగం చూచుకోవాలి. ఆపైన నింపాదిగా పెళ్ళిమాట. ఇంతకూ మనసులు కలవడమే ముఖ్యం, మంగళసూత్రం కట్టడం ఓ తతంగం ....కానీ ఈ మాత్రం ఓపిక తల్లిదండ్రులకు లేకపోయింది. అదే వచ్చిన చిక్కు.

పారిపోవడ మొకటి తప్పితే ఈ విపత్తునుంచీ బయట పడడానికి మరొక మార్గం తోచలేదు విశ్వానికి. ఆలోచించి అతనొక పథకాన్ని నిర్ణయించేశాడు, రెంతోమనిషికి తెలియకుండా వూరువదలి పెట్టడంతో

ఆ పథకాన్ని అమల్లోగూడా పెట్టేశాడు. ఏ బొంబాయికో కలకత్తాకో వెళ్ళి ఓ కార్డుముక్క వ్రాసి పడేస్తాడు. అంతటితో ఆటకట్టు!

స్టేషనులో టికెట్టు కొనుక్కోడానికి ముందుగా - తన ప్లాను కాస్త సవరించుకున్నాడు విశ్వం. సెలవుల్లో సరోజిని గూడా స్వగ్రామానికి వెళ్ళి వుంటుంది. మార్గ మధ్యంలో అక్కడ దిగి ఆమె నొకసారి కలుసుకోవాలి.

ప్రొద్దుపోయి బాగా చీకటి పడేసరికి రైలొక స్టేషనులో ఆగింది. 'భోజనం చేయదలచుకుంటే యిక్కడే చేయాలి' అని ఎవరో సలహా యిచ్చారు. విశ్వం రైలుదిగి వెళ్ళి భోజనం చేసివచ్చాడు. కడుపులో మంట చల్లారడంతో మెల్ల మెల్లగా ఒక కునుకు అతడిపైన దాడిచేసింది.

* * * *

"పీలేరు.... పీలేరు...."

పోర్టరు కేక బావిలోనుంచి వినిపించినట్టె వులికిపడి దిగ్గునలేచి కూర్చున్నాడు విశ్వం.

"ఏమండీ! ఇక్కడ దిగేస్తారా?" అన్నాడొక ప్రయాణీకుడు.

"అబ్బే లేదండి, నేను వాయల్పాడు వెళ్తున్నాను ..." అన్నాడు విశ్వం.

ప్రయాణికులందరూ ఒక్కుమ్మడిగా తెల్లబోయారు. "ఇంకా ఏం వాయల్పాడయ్యా బాబూ! ఇది వాయల్పాడుకు మూడో స్టేషను. బండి ఆ స్టేషను వదలిపెట్టి గంటసేపైంది...."

విశ్వం దిగాలుపడి పోయాడు.

"పోనీ యిక్కడైనా దిగేయండి. రైలు కదలబోతోంది...."

అంతకంటే చేయదగ్గ పనేమిటో తోచక విశ్వం కదలుతున్న రైల్లోనుంచీ ప్లాటుఫారం మీదికి దూకేశాడు.

స్టేషను ఆవరణను చీకటిలో దిగవిడచి రైలు వెళ్ళిపోయింది. పైన చుక్కలు మిలమిలలాడుతున్న ఆకాశం. ఎదురుగా దిక్కులకు హత్తుకుని నిశ్చలంగా పడిఉన్న కొండలు, ఆకాశంక్రింద కొండకోనల మధ్య బిక్కుబిక్కు మంటున్న స్టేషను.

"ఎవరక్కడ! టికెట్టేది?" అని ప్రశ్నిస్తూ ఓ ఆకారం విశ్వాన్ని సమీపించింది.

"మన్నించండి సార్ ఒక చిన్న పొరబాటు జరిగింది. వాయల్పాడులో దిగవలసినవాణ్ణి. నిద్రపోతుండగా ఆ స్టేషను దాటిపోయింది కావలిస్తే ఎక్సెస్ చెల్లించుకుంటాను" అన్నాడు విశ్వం.

స్టేషను మాష్టరుగారు విశ్వాన్ని బుకింగ్ రూములోకి తీసుకెళ్ళారు. టికెట్టుతోబాటు మనిషి వాలకాన్ని గూడా పరీక్షించి "ఎక్సెస్ చెల్లించడం కాదు, ఎదుటిమనిషి నిజం చెబుతున్నాడా, లేదా అన్నదే ముఖ్యం" అంటూ చిరునవ్వు నవ్వాడు.

వల్లకాడులాంటి ఈ స్టేషనులో దిగవలసి రావడమే ఒక గ్రహచారం. అందుకు తోడూ అబద్ధాలు కూడానా?" అంటూ విశ్వం నిట్టూర్చాడు.

"పోనీలే అబ్బాయ్! ఎలాగూ నువ్వు రైల్లోనే నిద్రపోయావు. నాకు నైట్ డ్యూటీ వుండనేవుంది. తెల్లవారుజామున మూడు గంటలకు గానీ తిరుగుబండి లేదు. అందాకా మనం మాట్లాడుతూ కూచోవచ్చు...."

విశ్వం నవ్వలేక నవ్వుతూ "అర్థరాత్రిదాకా మాట్లాడి ఆ తర్వాత కునుకు తీద్దామన్న వుద్దేశంలో పడుకుంటే ఆ రైలుకూడా తప్పిపోవచ్చు గదండీ!" అన్నాడు.

"అభయం నీ కనవసరం. ఎందుకంటే అదే రైల్లో నేనూ వాయల్పాడు వస్తున్నాను. అదీగాక మూడు గంటల రైలు మూడు గంటలకే

వస్తుందన్న పూచీ ఏముంది ? భళ్ళున తెల్లవారిన తర్వాతగూడా రావచ్చు. ఈమధ్య ఒకసారి ఏం జరిగిందంటే....''

వరండాలో ఓ నీడ మసలడంతో స్టేషను మాస్టరుగారి ప్రసంగానికి బ్రేకు పడింది,

ఆగంతకుడికి అరవయ్యేళ్ళుంటాయి, బ్రతుకు బరువును మోసీమోసీ గూనిపోయినట్టున్నాడు. పళ్ళు వూడిపోవడం వల్ల దవడలు లోపలికిపోయి, కళ్ళ క్రిందలి ఎముకలు పైకి లేచి కళ్లు మరీ లోతుకు దిగజారి, నుదురు పైకి తేలిన ఆముఖంలో ఆందోళన, కంగారూ స్పష్టంగా కనిపిస్తున్నాయి.

"ఇంతకు మునుపు వెళ్లిపోయింది రైలేనటండీ?........" అతడు ఆదుర్దాగా ప్రశ్నించాడు.

రైలుదారిపైన రైలుగాక బస్సు పరుగెడుతుందా అందామనుకున్నాడు విశ్వం.

'అవునండీ వెళ్లింది రైలే' గూడ్సుకాదు' అన్నాడు స్టేషను మాష్టరుగారు.

ముసలాయన నిట్టూరుస్తూ వసారాలో బెంచీపైన కూలబడిపోయాడు.

'నువ్వు తాతగారితో మాట్లాడుతూ కూచో అబ్బాయ్! నేనిప్పుడే యింటికివెళ్లి తిరిగొస్తాను' అంటూ స్టేషనుమాష్టరు విశ్వాన్ని బయటికి పంపి తలుపులు మూసి తాళం వేసుకుని క్వార్టర్స్ వైపు వెళ్ళిపోయాడు.

విశ్వం కొంతసేపు వరండాలో పచార్లుచేశాడు, పరిసరాల్లోకి శూన్యంగా చూస్తూ స్తంభాని కానుకుని నిల్చున్నాడు. ఆవులించాడు, పడుకోటానికి బావుంటుందేమోనని బెంచీ వైపు చూశాడు.

'ఏవూరబ్బాయ్' అంటూ ముసలాయన పలకరించాడు.

'ఈ ప్రాంతం కాదండీ తాతగారూ! వ్యాపారనిమిత్తం వూళ్ళు తిరుగుతున్నాను....'

'అలాగా నాయనా! నిలబడిపోయావెందుకు? కూచో' ఆదరంగా ఆహ్వానించారు తాతగారు.

విశ్వం కూచున్నాడు. కూచోగానే అతడు భయపడినట్టుగా ప్రశ్నల వర్షం ప్రారంభమైంది.

'తల్లిదండ్రులున్నారా! బాబూ'

'లేకేమండీ! ఉన్నారు' అన్నాడు విశ్వం.

'నాన్నగారేం చేస్తుంటారు?'

విశ్వం లోలోపలే వుడికిపోతూ 'అరుగుపైన కూచుని దారంటవెళ్ళే వాళ్ళని పులిజూదానికి పిలుస్తుంటాడు' అన్నాడు.

"అదృష్టవంతుడు. నీలాంటి బుద్ధిమంతుడైన కుమారుడుండగా ఆయనకేంచేస్తే చెల్లదు! నాకూ వున్నారు ముగ్గురుకొడుకులు, ఏం లాభం? చదివించాను. డిగ్రీలు సంపాదించారు. ఆ మాత్రం చదువుకోవాలే గానీ సంబంధాలకేం కొదవ. కొడుకులు ముగ్గుర్లోనూ పెద్దాడేమో తాసిల్దారుగారి అల్లుడు. రెండోవాడు పెద్దవకీలు కూతుర్ని పెళ్ళాడాడు. మూడోవాడికి పిల్లనిచ్చిన మామగారు గవర్నమెంటు డాక్టరు. వాళ్లందరూ రెండు చేతులా సంపాదించేవాళ్లు. పులిని చూచి నక్క వాతవేసుకోలేదా! ఈ అల్లుళ్ళు మామగార్లతో సమానంగా హోదాలు వెలగబెట్టాలనుకుంటారు. అదెలా కుదిరేటట్టు? అందుకు వీళ్ళ సంపాదనేం సరిపోతుంది. ఉట్టికీ స్వర్గానికీ గూడా కాకుండాపోయారు. ఎందుకొచ్చిన చదువులు బాబూ! దీనివల్ల కుర్రాడి వెల మాత్రం పెరుగుతుంది. అపాటికక్కడ కుటుంబం చితికిపోయి వుంటుంది. ఆ కొడుకెలాగూ ఈ కాపురానికి సాయపడడు. ఇంకానయం!

వాడు బాగుపడేదైనా సందేహమే ! నా మట్టుకు నా బ్రతుకేమైందో చూడు. నా తోటలో పుట్టిన మొక్కలన్నీ తీసుకెళ్లి వేరే మామిడిచెట్లకు అంటు గట్టినట్టయింది. నా బిడ్డలకు నవ్వూసే కాబట్టడంలేదు"

కాసేపాగి ముసలాయన మళ్ళీ చెప్పసాగాడు.

'ఈ లోకంలో ఎవరిగొడవతో వాడికే సరిపోతుండగా, ఇంకొకడి గొడవ వినే ఓపరికం ఎవరికుంటుంది. ఐనా మనసుంతక పొద వెళ్ళబోసు కోవలసి వస్తుంది.'

బొత్తిగా మూగపట్టడానికి మనస్కరించక తాతగారి ప్రసంగంపట్ల శ్రద్ధను అభినయిస్తూ 'అయితే యిప్పుడు మీ ప్రయాణం ఎందాకండీ?' అన్నాడు విశ్వం,

'చూశావా! అసలు సంగతితప్ప, మిగిలినవన్నీ చెప్పాను. ఈ ప్రయాణం అమ్మాయి పెళ్ళికి బట్టలు కొనడంకోసం. ఒకేకూతురు నాకు! కడగొట్టుబిడ్డ తల్లి చిన్నతనంలోనే పోయింది. దీనికి వయసొచ్చి పెళ్ళి చేయవలసి వచ్చేసరికి నాచేత చిల్లిగవ్వ లేకుండా పోయింది. కాలికి బలపం గట్టుకుని కొడుకులచుట్టూ తిరిగాను. ముగ్గురూ కలిసి ఈ పెళ్ళి చేస్తే అంతకంటే నాకు కావలసిందే లేదన్నాను. వినిపించుకున్న నాథుడు లేడు. ఏం చేస్తానుమరి, ఉన్న ఒక్క పెంకుటింటినీ అమ్మేశాను, వియ్యంకుడు గుణాన్ని మాత్రం చూశాడు. పెద్ద కట్నానికి పాలుమారి కొడుకుని నమ్ము కుంటే వాడు పెళ్ళయిన మర్నాడే తనకోసం గుడిసె కేటాయిస్తాడని ఆయనకు తెలుసు. ఆయనలా అనుకోకుంటే నాకీ సమ్మంధం కుదిరేదే కాదు. రేపు గురువారం గాక మళ్ళీవచ్చే గురువారమే పెళ్ళి ..'

విశ్వం వులికి పడ్డాడు.

"ఆరోజు చాలా పెళ్ళిళ్ళున్నట్టున్నాయి గదండీ!-

"వుండవూమరి! భేషైన ముహూర్తం...."

"అలాగా! పెళ్లికుమారుడి దేవూరో చెప్పారు కారు...."

"కదిరి"

విశ్వానికి గుండె ఆగిపోయినంత పనయింది. తెల్లబోయి వృద్ధుడి వైపు బిక్కరించి చూస్తూ "కదిరి నాకు బాగా పరిచయమున్న వూరేనండి తాతగారూ" అన్నాడు.

"మరి శేషయ్యగారిని ఎరుగుదువా బాబూ! రావిచెట్టు వీధిలో నాలుగో యిల్లు...."

విశ్వంనోట మాటరాక స్తంభించిపోయాడు. "ఈ పెళ్లి జరగనే జరగదు. ముమ్మాటికీ జరగదు" అని బిగ్గరగా అరిచి దూరంగా పారిపోవాలనిపించిందతనికి! అరవకపోయినా అలా అరచినట్టు, పారిపోకపోయినా పారిపోతున్నట్టు తోచి అతడు మతి గోల్పోయిన వాడిలా మౌనంగా కూర్చుండిపోయాడు.

"ఏమిటి బాబూ! ఏదో ఆలోచిస్తున్నావు" అన్నారు తాతగారు.

విశ్వం బదులుచెప్పలేదు. అమాంతంగా నిద్ర ముంచుకుకొచ్చేసినట్టు బెంచీకి చేరగిలబడి పోయాడు.

*  *  *  *

తెల్లవారుజాము రైలుబండి పీలేరుస్టేషను వదలి వాయల్పాడువైపు పరుగిడుతోంది.

ఆ బండిలోనే వాయల్పాడుకు బయల్దేరిన చింతపర్తి స్టేషను మాస్టరుగారు ఓ పొడుగాటి పొగచుట్ట ముట్టించారు.

ఐన సిగరెట్లన్నీ తగలేసి ఆ రాత్రంతా శివరాత్రిగా వేగించిన విశ్వం ఆ పొగ మబ్బులకేసి చూస్తూ, గ్రుక్కిళ్ళు మింగుతూ కూచున్నాడు.

"ఏమండీ వామన్రావుగారూ ! మీరూ పెళ్ళికేనేమిటి ? ఐనా నేనూ రేణిగుంట నుంచీ చూస్తున్నాను. ఏ పెట్టెలో చూచినా వాయల్పాడు పెళ్ళి జనమే !" అంటూ ఓ పెద్దమనిషి లేచివచ్చి స్టేషను మాష్టరుగారి సరసన కూర్చున్నాడు.

"ఐతే ఇదొక స్పెషలు ట్రెయినని చెప్పండి !" అంటూ నవ్వారు స్టేషను మాస్టరు.

"కుటుంబంలో చివరి పెళ్ళి కదండీ ! కాస్త భారీ ఎత్తున చేస్తారేమో ననుకున్నాం. కానీ పట్టు పట్టున పదిరోజుల్లో చేయవలసి వచ్చినందువల్ల కట్టె కొట్టె, తెచ్చె అన్నట్టు క్లుప్తంగా ముగి చబోతున్నారట ! నీలకంఠం గారు తిరుపతిలో కనిపించి చెప్పారు...."

నీలకంఠంగారు !

నిద్రమత్తులోంచి తేరుకుని "ఏ నీలకంఠంగారు ?" అన్నాడు విశ్వం.

రిటయిర్డు డి. యస్. పి. నీలకంఠంగారు" నెమ్మదిగా బదులు చెప్పారు యస్. యం. వామనరావుగారు.

"ఎలాగైనా నీలకంఠం గారిది అదృష్ట జాతకమండీ !" పెద్దమనిషి చెప్పుక పోతున్నాడు. "దిగ్గజాలలాంటి అల్లుళ్ళను సంపాదించ గలిగాడు. ఈ కొత్తల్లుడు ఎంచేస్తున్నాడో ఎరుగుదురా మీరు ? అదేదో దేశంలో రాయబార కార్యాలయంలో పనిచేస్తున్నాడట ! మనిషిమాత్రం నల్లగా చింత మొద్దులా వుంటాడట ! ఉంటేనేమి ? ఇలాంటి సంబంధం మళ్లీ దొరకదని చదువు మాన్పించేసి అమ్మాయికి ఆదరా బాదరా పెళ్ళి చేసేస్తున్నారు. ఆ అమ్మాయికి మాత్రం వుబలాటంగా వుండదటండీ ? ఎంచక్కా విదేశాలు చూడొచ్చు, విమానంలో తిరగొచ్చు ..."

రైలు చక్రాలు చేస్తున్న ఠణగోణ ధ్వనివల్ల నైతేనేమి, మనసులో హోరుహోరున చెలరేగిన తుఫానువల్లనైతేనేమి ఆ తరువాత మాటలు విశ్వానికి వినిపించాయి గావు. రైలు స్టేషనులో ఆగబోతుండగా అతడు వామనరావుగారి దగ్గరికి జరిగి "చూడండి మేష్టరుగారూ! ఏమిటో నాకారోగ్యం బాగున్నట్టు లేదు. సమ్మెటలతో బాదినట్టు తల పలిగిపోతోంది. నేనిలాగే మా వూరికి వెళ్ళిపోతాను. దయచేసి మీరు స్టేషనులో దిగగానే నాకు కదిరికొక టిక్కెట్టు కొనిపెట్టండి" అన్నాడు.